క్లుప్తంగా

కేశాలు దానం


కేశాలు దానం చేస్తున్న సాయిమాన్య

మదనపల్లె సిటీ: క్యాన్సర్ బాధితులకు మానసికంగా తోడుగా నిలవాలని హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో హెయిర్ డొనేషన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణానికి చెందిన శబరినాథ్, తేజస్విని దంపతుల కుమార్తె సాయిమాన్య కేశాలను దానం చేశారు. స్థానిక హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయంలో విద్యార్థినికి ఘనంగా సన్మానించారు. అభినందించారు. క్యాన్సర్ బాధితులకు ఉచితంగా విగ్గులు తమ సంస్థ అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పలువురు దాతలు ముందుకు వచ్చి కేశాలు దానం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కిరణ్, ఖాజా పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె పంచాయితీ కొత్తపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆదివారం ఆరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో తిరుపతి మెడిగో హాస్పిటల్ వైద్యులు 35 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 130 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డాక్టర్ పి.వి. బ్రహ్మారెడ్డి, ట్రస్ట్ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ జిలానీ, డాక్టర్ షమీమ్, వలంటీర్లు షబ్బీర్, బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎద్దు పొడవడంతో రైతుకు గాయాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కాట్నగల్లుకు చెందిన చింతపల్లె ఉత్తన్న (55) అనే రైతు ఎప్పటి లాగానే తన ఎద్దులను ఆదివారం మేతకు తోలుకెళ్లారు. ఈ తరుణంలో ఆకస్మాత్తుగా ఎద్దు రైతును పొడిచింది. తీవ్రంగా గాయపడిన రైతును కుటుంబీకులు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మల్లయ్యకొండ ఈఓగా మునిరాజ



తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ ఈఓగా ఎద్దుల మునిరాజ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలిలోని మొగిలీశ్వరస్వామి ఆలయ ఈఓగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తానన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

దిగ్విజయం గ్రంథావిష్కరణ


దిగ్విజయం కావ్యాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని మరసం కార్యాలయంలో ఆదివారం ప్రముఖ రచయిత కంటమ్ముళ్ల సుబ్రమణ్యంనాయుడు రచించిన దిగ్విజయం (వాస్తు కావ్యం)ను రచయితలు ఆవిష్కరించారు. మరసం అధ్యక్షులు పీవీ ప్రసాద్ మాట్లాడుతూ వాస్తు ప్రకారం ఇళ్ల నిర్మాణం ఎలా చేసుకోవాలనే విషయాలను పుస్తకంలో రాయడం జరిగిందన్నారు. రచయిత తన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రచించడం జరిగిందన్నారు. ఇలాంటి రచనలు అందరికి అవసరమన్నారు. కార్యక్రమం సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు మునిగోపాలకృష్ణ, కామకోటి ప్రసాదరావు, మరసం కార్యదర్శి యుగంధరాచారి, రచయితలు నాగరాజు, రామమోహన్‌నాయుడు, వంశీధర్, శ్రీనివాసులు, చలపతి, ప్రసాదరెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అనంతరం రచయితను ఘనంగా సన్మానించారు.

సమాజసేవ చేయడమే లక్ష్యం

పీలేరు : సమాజసేవ చేయడమే వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ లక్ష్యమని ఆ శాఖ రీజియన్ చైర్ పర్సన్ పామిడి జయచంద్ర అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వి211ఏ రీజన్1 ఉన్న కల్వారు, బి.కొత్తకోట, చిన్నగొట్టిగల్లు, మదనపల్లె, పీలేరు మండలాల్లోని మొత్తం ఎనిమిది క్లబ్బులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. వాసవిక్లబ్ ఆధ్వర్యంలో వివిధ రకాల వైద్యశిబిరాలు నిర్వహించడంతోపాటు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పైపాటి వెంకటసుషాని, నాగేష్, బాలాజి, సురేష్, భరత్, హరి, తులసి, వెంకయ్య, అరవిందబాబు, నరేంద్రకుమార్, తేజ, వేణు, సుధీర్, బాలసుబ్రమణ్యం, మల్లికార్జున, మహాలక్ష్మి పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ టోల్‌గేట్‌కు పోటాపోటీ

- మూడేళ్లలో రూ.66.21 లక్షల ఆదాయం
- ప్రస్తుత ఏడాదికి నేడు వేలంపాట
- ఎంట్రీ రుసుముకు మళ్లీ భారీగా వడ్డింపు?


హార్సిలీహిల్స్ ముఖద్వారం వద్ద టోల్ వసూలు చేస్తున్న సిబ్బంది

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పైకి వెళ్లాలంటే చెల్లించాల్సిన ఎంట్రీ ఫీజు వసూలుకు సోమవారం నిర్వహిస్తున్న వేలం పోటాపోటీగా సాగనుంది. సాధారణంగా సాగుతున్న ఈ వేలంపాటలు మూడేళ్లుగా లక్షల్లో.. అందులో ఎవరూ ఊహించని విధంగా రూ.66.21 లక్షల ఆదాయం వచ్చింది. దీనితో ప్రస్తుత ఏడాదికి దర ఎంత పలుకుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు బైక్, కార్లు, ఆటోలు, మినీ బస్సులు, బస్సుల్లో వస్తుంటారు. రెవెన్యూ అధికారులు వీరినుంచి గతంలో రూ.10 నుంచి రూ.50 వసూలు చేసేవారు. ఈ రుసుమును గత సబ్‌కలెక్టర్ జాహ్నవి మాడింతలు పెంచి వేలం పాటలు నిర్వహించగా రూ.12.01 లక్షలు పలికింది. తర్వాత ఆర్డీఓ మురళి దీని ఆదాయంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఎంట్రీఫీజు వసూలును భారీగా పెంచేశారు. బైకుకు రూ.20, కారుకు రూ.70, ఆటోకు రూ.60, మినిబస్సులు, మిగిలిన భారీ వాహనాలకు రూ.120 ఉన్న ఎంట్రీ ఫీజు ఏకంగా బైకుకు రూ.25, కారుకు రూ.100, ఆటోకు రూ.75, మినీ బస్సు, భారీ వాహనాలకు రూ.170కు పెంచేశారు. దీనితో వేలంపాటదారులు కూడా భారీగా పాడేందుకు సిద్ధమయ్యారు. 2022 ఆగస్టు 25న నిర్వహించిన వేలంలో ఊహించని విధంగా కోటవూరు గ్రామానికి చెందిన సతీష్ రూ.26.85 లక్షలకు పాడారు. తర్వాత 2023–24 ఏడాదికి రూ.50వేలు అదనంతో రూ.27.35 లక్షల ఆదాయం వచ్చింది.

నేడు పోటాపోటీ

సోమవారం టోల్ వసూళ్లకు నిర్వహిస్తున్న వేలంపాటలు పోటాపోటీగా జరగనున్నాయి. ఇప్పటికే ఏడుగురు వేలంపాటలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోగా, సోమవారం మధ్యాహ్నం 12 గంటల వరకు పాల్గొనేవారు పేర్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. ఈ వేలంపాటల్లో 10 మందికిపైగా పాల్గొనే అవకాశం ఉంది. దీనితో వీరి మధ్య పోటీ నెలకొని వేలం భారీగా జరగనుంది.

మళ్లీ వడ్డన

ప్రస్తుతం వసూలు చేస్తున్న టోల్ ఫీజును మరింత పెంచి వేలం నిర్వహించాలన్న ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఉన్న రుసుమాలతో సందర్శకులు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. రుసుమును పెంచడం వల్ల సాధారణ సందర్శకుల రాకను నియంత్రించినట్లు అవుతుందని అంటున్నారు. పేదవాడి ఊటీగా పిలుచుకునే ఆంధ్రా ఊటీగా చెప్పుకుంటున్న హార్సిలీహిల్స్‌కు వచ్చేది 90 శాతం మంది సాధారణ సందర్శకులే. దీనితో ఇప్పుడున్న రుసుమును మళ్లీ పెంచితే..మా రుసుముపై ఆధారపడి ఉన్నారా అన్న ఆగ్రహం సందర్శకుల్లో వ్యక్తమై వ్యతిరేకత వచ్చే పరిస్థితి స్పష్టం కనిపిస్తోంది.

మానవతా సంస్థ సేవలు విస్తృతం చేద్దాం


మాట్లాడుతున్న మానవతా సంస్థ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి

వాల్మీకిపురం: మానవతా సంస్థ సేవలు విస్తృతం చేద్దామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక భగవాన్ శ్రీ సత్యసాయి సేవా మందిరంలో మానవతా సంస్థ సభ్యులతో నెల వారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో 17 సార్లు ఫ్రీజర్ బాక్సులు, 17 సార్లు అంబులెన్స్ సర్వీసులు, 13 సార్లు వైకుంఠ రథాన్ని ప్రజలు ఉపయోగించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రామకృష్ణారెడ్డి, ఉదయ రెడ్డి, నీళ్ళబావ్యర్, శంకర, మణి, పీవీ నారాయణ, రమణమూర్తి, ఆనంద శెట్టి, కోహిర్ చంద్రమౌళి, లక్ష్మీనారాయణశెట్టి, దివిన్ షాన్, శ్రీనివాసులు, చంద్ర, సత్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సేవలను విస్తరిద్దాం

కలకడ : మండలంలోనే కాకుండా కేవీపల్లె, కలికిరి, గుర్రంకొండ మండలాలలోని వారికి కూడా కలకడ మానవత సంస్థ తరుపున సభ్యులు సేవలు అందించడం అభినందనీయం. సంస్థ ఉచిత సేవలను అంతటా సమర్థవంతంగా మరింతగా విస్తరిద్దామని కేవీపల్లె మండలం, గ్యారంపల్లె ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీహరి అన్నారు. ఆదివారం నెలవారి సమావేశంలో భాగంగా కలకడ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో అధ్యక్షుడు పీవీ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గత మాసంలో అందించిన ఉచిత సేవలను సభ్యులకు తెలియజేశారు. వర్షాకాలం ప్రారంభం కాగానే కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటి వాటిని పెంచి, సంరక్షించే బాధ్యతను సభ్యులు తీసుకోవాలని సూచించారు. కార్యాలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గంగాధినాయుడు, శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి వెంకటేష్, వెంకటసుబ్బయ్య, నాగేశ్వర, వెంకటరమణ, భాజాపీర్, పీవీ రమణ, వైదిరమణ,మోహన, సుధాకర, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- వన్ టౌన్ సీఐ చాంద్‌బాషా


సీఐ చాంద్‌బాషాకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె సిటీ: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని మదనపల్లె వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక బీటీ కాలేజీ మైదానంలో సౌత్‌ఇండియన్ న్యూరో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆస్పత్రి ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకుని ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఈసీజీ, ఎకో, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. గుండెపోటుతో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ముందు జాగ్రత్తగా ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేసుకోవాలన్నారు. నిమ్స్ ఆస్పత్రి నిర్వాహకులు, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ నాగూరు శివారెడ్డి మాట్లాడుతూ వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకుని గుండెపోటు గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆహారపు అలవాట్లు, సరైన వ్యాయామం, మంచి అలవాట్లు అలవాటు చేసుకోవాలన్నారు. గుండె పోటు వచ్చిన వెంటనే సమీపంలోని గుండెజబ్బుల ఆస్పత్రికి వెళ్లి చికిత్సలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీలు పి.ప్రసాదరెడ్డి, రాంబాబు, వీరభద్ర, ఎస్ కార్తీక్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆ భూములు మాకు ఇప్పించండి

- సీపీఐ నేతలకు రైతుల వేడుకోలు


రైతులు సాగు చేస్తున్న భూమిని పరిశీలిస్తున్న నాయకులు

బి.కొత్తకోట: దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను తమకే ఇప్పించాలని బి.కొత్తకోట మండలం మొటుకు పంచాయతీ ముదివారిపల్లెకు చెందిన రైతులు ఆవేదనతో వేడుకున్నారు. గట్టుకు చెందిన మదనపల్లె మాజీ ఎమ్మెల్యే ఆలూరి నరసింగరావు జీవించి ఉన్న కాలంలో ఈ గ్రామంలో ఆయనకు చెందిన భూములను స్థానిక రైతులు కౌలుకు సాగు చేసుకుంటున్నారు. 40 మంది రైతులు 22 ఎకరాలపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరు 30 ఏళ్ల క్రితం నరసింగారావుకు భూమి కొనుగోలుకు కొంత నగదు ఇచ్చామని చెబుతున్నారు. అయితే ఆయన వారసులు ఈ భూములను ఆ రైతులకు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. దీనితో ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి ముదివారిపల్లెకు వెళ్లి రైతులు, వారు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమగోడు విన్నవించుకున్నారు. 30 ఏళ్లుగా ఈ భూములపైనా ఆధారపడి జీవిస్తున్నామని, వీటిని ఇతరులకు విక్రయిస్తే తమ బతుకు రోడ్డుపాలవుతాయని ఆవేదన చెందారు. తాము సాగు చేస్తున్న భూములు తమకే అంటూ విక్రయించరాదని, ఇప్పుడు ఈ భూములు తమకు దక్కకుంటే ఏం చేయాలని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరారు. దీనిపై సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో పేరు కలిగిన ఆలూరి కుటుంబం పేద రైతుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని కోరారు. వారు సాగు చేసుకుంటున్న భూమిని వారికే రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేలా మానవత్వంతో చూడాలని కోరారు.

ఏడాది పాటు టౌన్‌బ్యాంక్ శతవార్షిక సంబరాలు

- రూ.111కోట్ల 31లక్షలకు చేరిన బ్యాంకు వ్యాపార ధనం
- పేరు ధనమున్నైన 10శాతం డివిడెండ్ చెల్లింపు

మదనపల్లె : మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శతవార్షిక ఉత్సవాలను ఏడాదిపాటు ఘనంగా నిర్వహిస్తామన్నారని సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ క్యాంప్రసాద్‌రెడ్డి, బ్యాంక్ సీఈఓ పి.వి. ప్రసాద్ తెలిపారు. ది మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ 100వ వార్షిక మహాజనసభ సమావేశం ఆదివారం బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.వి.ప్రసాద్, టౌన్‌బ్యాంకు శతవార్షిక ప్రస్థానంను సభ్యులకు చదివి వినిపించారు. రూ.410 షేరు ధనముతో 1924లో 30 మంది సభ్యులతో, షేరుదిలుంచ రూ.1తో ప్రారంభమైన టౌన్‌బ్యాంకు, ప్రస్తుతం డిపాజిట్లు రూ.90కోట్ల84లక్షలు, ఇచ్చిన రుణాలు రూ.58కోట్ల86లక్షలతో కలిపి 2023–24 ఆర్థిక సంవత్సరం అంతం నాటికి రూ.111కోట్ల31లక్షల వ్యాపారధనమును కలిగి ఉందన్నారు. రూ.2కోట్లు8లక్షల85వేల499 రూపాయలు స్థూలలాభం పొంది, రూ.52లక్షల 2వేల 926 ఇన్‌కంటాక్స్ చెల్లించి, రూ.1కోటి53లక్షల62వేల825 రూపాయలు నికరలాభం సంపాదించిందన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి షేరుధనముపైన 10శాతం డివిడెండు చెల్లిస్తున్నామన్నారు. బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 5.72శాతంగా ఉన్నవని, నికర నిరర్థక ఆస్తులు 0.95 శాతంగా ఉన్నాయన్నారు. రిజర్వ్‌బ్యాంక్ తాజా నిబంధనల ప్రకారం నిరర్థక ఆస్తుల ప్రక్రియ నిరంతర ప్రక్రియగా చేపట్టాల్సి ఉన్నందున ఖాతాదారులు తాము తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని కోరారు. రిజర్వ్‌బ్యాంక్ నిబంధనలు అన్నింటిని మదనపల్లె టౌన్‌బ్యాంక్ సక్రమంగా పాటిస్తూ, ఎలాంటి ఉల్లంఘనలు చేయలేదన్నారు. నాబార్డ్స్ రేట్లుగా టౌన్‌బ్యాంక్‌కు పాలకవర్గం లేనందున శతవార్షిక సంబరాలను ఘనంగా నిర్వహించలేక పోయామన్నారు. త్వరలో టౌన్‌బ్యాంక్ పాలకవర్గం ఏర్పాటైన తర్వాత ఏడాదిపాటు శతవార్షిక సంబరాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. టౌన్‌బ్యాంక్ డైరెక్టర్‌గా 20 ఏళ్లపాటు సేవలందించిన ఆర్.చంద్రశేఖర్ ఆత్మకు శాంతి కలగాలని సమావేశ ప్రారంభంలో రెండునిమిషాల సేపు మౌనం పాటించారు. సమావేశంలో బ్యాంక్ ఆడిటర్లు కేఎస్ఎస్.ప్రసాద్, పీఎస్.చైతన్య, బ్యాంక్ మేనేజర్లు సుధారాణి, జయచంద్రనాయుడు, రవిచంద్రారెడ్డి, రాధిక, రాజేశ్వరి, బ్యాంక్ సిబ్బంది, మాజీ డైరెక్టర్లు పసుపులేటి, ఎస్.ఎ.రియాజ్, మధుకర్, సయ్యద్‌హసన్, సోమశేఖర్, భాస్కర్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో రాణించాలి


మాట్లాడుతున్న ఎంఈవో రెడ్డిబాషా

కేవీపల్లె : ఆటల పోటీల్లో జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఎంఈవో రెడ్డిబాషా, స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రటరీ జయరామయ్య అన్నారు. ఆదివారం మండలంలోని గ్యారంపల్లె గురుకుల జూనియర్ కళాశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 విభాగంలో హ్యాండ్‌బాల్, క్రికెట్, టెన్నికాయిట్, రగ్బీ ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు జట్లును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. క్రీడలతో చక్కటి శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఉన్నత చదువుల, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు, సర్పంచ్ రెడ్డెప్ప, మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు పురుషోత్తం, మునిరాజేశ్వరి, కళాశాల సిబ్బంది రమాదేవి, శేఖర్, హరి, కొండయ్య, షకీల్‌అహ్మద్, నాగేంద్ర, నాగరాజునాయక్, అన్నపూర్ణ, సౌజన్య పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల వైదేశ్వార్లు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ముందు సంతానం కోసం వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరసారెలతో మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు.

సమష్టిగా సమస్యల పరిష్కారం

- హార్సిలీహిల్స్ సొసైటీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్


మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సభ్యులు సమష్టిగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సొసైటీ కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్‌రెడ్డి కోరారు. ఆదివారం సొసైటీ అధ్యక్షుడు ఆర్.కృష్ణారెడ్డి అధ్యక్షతన సంఘ సాధారణ సభ జరిగింది. హాజరైన సభ్యులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ 16 ఏళ్ల క్రితమే హార్సిలీహిల్స్‌పై సభ్యులకు స్థలాలను కేటాయించి రిజిస్ట్రేషన్లు చేసి ఇవ్వడం జరిగిందన్నారు. హైకోర్టులోని కేసు తీర్పు కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. ఈలోగా ప్లాట్లు పొందిన వారు ఇంటి నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. టౌన్‌షిప్ కమిటి చైర్మన్‌కు ఇంటి ప్లాన్లు అందజేసి అనుమతులు పొందాలని కోరారు. ప్రభుత్వం నుంచి సొసైటీ కొనుగోలు చేసిన భూమికి గతంలో పనిచేసిన కొందరు రెవెన్యూ అధికారులు సరైన నివేదికలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంవల్లే సమస్య జటిలమైందన్నారు. ఆక్రమిత సొసైటీ భూమిని వేరు చేసిన తర్వాతనే లేఅవుట్ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, దీనికి అప్పటి మదనపల్లె సబ్‌కలెక్టర్లు సిఫార్సులు చేశారని వివరించారు. అన్ని పత్రాల పరిధిలో నిబంధనల మేరకు వ్యవహరిస్తున్నా ఇంకా ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టులో పెండింగ్‌లోని కేసు తీర్పు తర్వాత సమస్యలన్నీ తీరిపోతాయని అన్నారు.

రేపు ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం

వాల్మీకిపురం: వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం ఉదయం స్వర్ణధారా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పైరోజా బేగం తెలిపారు. 18 సంవత్సరాలు నుండి 50 సంవత్సరాలలోపు స్త్రీ, పురుషులు, యువత అందరూ శిబిరంలో పాల్గొని, రక్తదానం చేసి, దేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

మదనపల్లెకు అంబేడ్కర్ ధమ్మయాత్ర

మదనపల్లె : దేశప్రజల మధ్య శాంతి, సహోదరత్వం కాంక్షిస్తూ, కేరళలోని బుద్ధభూమి నుంచి మహారాష్ట్రలోని దీక్షభూమి వరకు నిర్వహిస్తున్న ఆశోక–అంబేద్కర్ ధమ్మయాత్ర మంగళవారం ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందని బుద్ధ అంబేడ్కర్ సమాజ్ ఫౌండర్ ట్రస్టీ పీటీయం శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశోక–అంబేద్కర్ ధమ్మ యాత్ర మదనపల్లెకు రానున్న సందర్భంగా పట్టణంలో శాంతి, సహోదరత్వ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డాక్టర్.అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉదయం 11 గంటలకు ర్యాలీ ప్రారంభమై, బెంగళూరురోడ్డులోని న్యూ అంబేద్కర్ సర్కిల్ వరకు కొనసాగుతుందన్నారు. బుద్దిస్ట్ ప్రెటర్నిటీ కౌన్సిల్, నేషనల్ ధమ్మయాత్ర కమిటీలతో కలిసి బుద్ధ అంబేద్కర్ సమాజ్, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా మదనపల్లెలో నిర్వహిస్తున్న శాంతి, సౌభ్రాతృత్వర్యాలీలో పెద్దసంఖ్యలో అంబేద్కర్ అనుయాయులు, బౌద్ధ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని శివప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

మాలల ధర్మయుద్ధం కరపత్రాలు ఆవిష్కరణ


మాలల ధర్మయుద్ధం కరపత్రాలు ఆవిష్కరించిన మాలమహానాడు నాయకులు

పీలేరు : అక్టోబర్ 6న హలో మాల.. చలో రాయచోటి మాలల ధర్మయుద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణికుమార్, రాయలసీమ జిల్లాల కార్యదర్శి సుభాష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎల్లమ్మగుడిలో మాలల ధర్మయుద్ధం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి ఎస్ఎన్ కాలనీలోని కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న హోమ్‌గ్రౌండ్స్‌లో మాలల ధర్మయుద్ధ సభకు మాలలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీలను విభజించి ఐక్యతను దెబ్బతీసేలా బీజేపీ సుప్రీంకోర్టు వర్గీకరణ తీర్పు ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎ. లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్, మల్లికార్జున, బాల గంగాధర్, రాజశేఖర్, విజయ్‌కుమార్, బాలాజి, రెడ్డెప్ప, విజయ్, రవిచంద్ర, చెంగమ్మ, సరస్వతి, మంజుల, లక్ష్మీ, దేవి, లత, వినయ్, వంశి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత


సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న నాయకులు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, బెంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి వైద్యసహాయ నిమిత్తం రూ.5లక్షల సీఎం సహాయనిధి చెక్కును అందించారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో యువనాయకులు జునైద్ అక్బర్, టీడీపీ నాయకుల బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పట్టణంలోని బాలాజీనగర్‌లో నివాసం ఉన్న ఎస్.చాంద్‌బాషా వెల్డింగ్ పనుల నిమిత్తం వెళ్లి ఇంటికి వస్తున్న సమయంలో కాండ్లమడుగు క్రాస్ వద్ద స్కూటర్ యాక్సిడెంట్ జరిగి తలకు బలమైన గాయం అయిందన్నారు. విస్మమైదు దెబ్బతినడంతో కుటుంబసభ్యుల వినతి మేరకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చొరవ తీసుకుని బెంగళూరు మణిపాల్ హాస్పిటల్‌లో చేర్పించారు. బాధితుడిది నిరుపేద కుటుంబం కావడంతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి చాంద్‌బాషా వైద్యసేవలకు సీఎం సహాయనిధి నుంచి రూ.5లక్షలు మంజూరు చేయించారన్నారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఆయన తరఫున బాధిత కుటుంబానికి నాయకులు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామవినోద్, నాగవేణి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరానికి స్పందన

మదనపల్లె : పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. వైద్యశిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు చేయించుకున్నారు. గ్లూకోమా, కార్నియా, రెటీనా, ఆర్బిట్ఓక్ట్ చికిత్సలతో పాటు విజన్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. 13 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని తిరుపతి అరవింద్ ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నారు. వైద్యశిబిరంలో జ్ఞానాంబిక కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ సురభిరామదేవి, డాక్టర్.శ్రేయ, సమన్వయకర్త వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ క్వార్టర్స్ స్థలంలో ఆక్రమణలు తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలోని పోలీస్ క్వార్టర్స్ కోసం కేటాయించిన స్థలంలో పలువురు ఆక్రమణలు ఇళ్లు నిర్మించుకున్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో ఆదివారం ఐ ఐదు ఇంటిని తొలగించారు. మరో రెండు ఇళ్లను తామంతట తామే తొలగిస్తామని రెవెన్యూ, పోలీసుల వద్ద సమయం తీసుకున్నారు. కార్యక్రమంలో సీఐ రాజా రమేష్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఐక్యతతో కలసి ముందుకెళ్దాం

- జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమల సుదర్శనం


ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు నాయకులు

వాల్మీకిపురం: మాలలు ఐక్యతతో కలసి ముందుకెళ్దామని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమల సుదర్శనం అన్నారు. ఆదివారం స్థానిక గాంధీబస్టాండ్ వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ జై మాల మహానాడు నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలలకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పులను ఖండిస్తున్నామన్నారు. దళిత సంఘాలు ఐక్యమై పోరాడి హక్కులను సాధించుకోవాలన్నారు. అనంతరం మాలమహానాడు నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాలమహానాడు సభ్యులు చంద్రయ్య, శివయ్య, మనోహార్, వెంకటస్వామి, మోహన్, సుధాకర్, మహేష్, రఘు, రవి, నరేష్, హరి, నాగార్జున, చిరంజీవి, ప్రవీణ్, అశోక్, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగజాతర


నడివీధి గంగమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

పీలేరు రూరల్ : మండలంలోని బాలంవారిపల్లె పంచాయతీ మొరవపల్లెలో గంగజాతర ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి గ్రామంలోని నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలతో 101 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. సంవృద్ధి వర్షాలు కురిసి పాడిపంటలు వృద్ధి చెందాలని పూజలు చేశారు.

అ'పూర్వ' కలయిక


సమావేశమైన పూర్వ విద్యార్థులు

మదనపల్లె సిటీ: వారంతా 41 సంవత్సరాల క్రితం ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో విద్యార్థులు. కాలేజీ స్థాపించినప్పటి మొదటి బ్యాచ్ ఇంటర్మీడియట్ చదివారు. వారంతా ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో 1981–83 ఇంటర్మీడియట్ పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పూర్వపు విద్యార్థిని భారతి, ఉషా మిత్రుల ఫోన్ నంబర్లు సేకరించారు. అందరూ ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఒక రోజు కాలేజీలో అందరూ కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఆదివారం కాలేజీలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పించిన అధ్యాపకులు శ్రీనివాసులు, వసికోలాను ఘనంగా సన్మానించారు. పూర్వపు విద్యార్థులు తాము చదివిన రోజులు, అప్పటి అధ్యాపకులు నేర్పిన పాఠాలు నెమరువేసుకున్నారు. కాలేజీకి కుర్చీలు అందించడానికి అంగీకరించారు.